మొబైల్ నంబర్‌ను లింక్ చేసుకోవాలి

యాచారం, ఫిబ్రవరి 6: గృహ అవసరాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్లకు తమ మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్ సిబ్బందికి విద్యుత్ వినియోగదారులు ఆధార్ నంబర్, రేషన్ కార్డు నంబర్, ఫోన్ నంబర్‌లను సకాలంలో ఇచ్చి సహకరించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే గృహజ్యోతి పథకానికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 6 : షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి నెలా ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం సెల్ నంబర్ 9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

మహిళ అదృశ్యం

శారద (ఫైల్)

కొత్తూరు, ఫిబ్రవరి 6: ఓ మహిళ అదృశ్యమైన ఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడిచెర్ల తండాలో జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం... కొడిచెర్ల తండాకు చెందిన సభావట్ కుమార్ భార్య సభావట్ శారద (24) శనివారం సాయంత్రం తన భర్త కుమార్‌కు ఫోన్ చేసింది. తన ఇద్దరి పిల్లలను ఇంట్లోనే వదిలి వెళ్లిపోతున్నానని చెప్పింది. ఆ తర్వాత తనకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం

చెక్కును అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్, ఫిబ్రవరి 6 : రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తాయని రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలక వర్గ సమావేశం జరిగింది. సమావేశంలో సంఘం అభివృద్ధికి పలు తీర్మానాలు చేశారు. సంఘంలో 57 మందిని నూతన సభ్యులుగా చేర్చుటకు, రైతులకు రూ.3 కోట్ల స్వల్పకాలిక, దీర్ఘకాలిక అప్పుల మంజూరు చేయడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, లక్ష్మమ్మ, నర్సింగ్‌రావు, స్వప్న, యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, భార్గవి, కార్యదర్శి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి చెక్కు అందజేత

సహకార సంఘం రైతు కుటుంబాలకు సైతం అండగా ఉంటుందని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి బ్రహ్మణపల్లికి చెందిన సంరెడ్డి రంగారెడ్డి ఇటీవల మృతి చెందాడు. సంరెడ్డి రంగారెడ్డి తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం సభ్యుడు కావడంతో మృతుడి కుటుంబ సభ్యులకు సహకార సంఘం నుంచి తక్షణ సాయం కింద రూ.25వేల చెక్కును అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 : ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములైన ఆశ కార్యకర్తలు, సెకండ్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లులోని కల్యాణి గార్డెన్‌లో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, యూనియన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సేవాదళ్ రాష్ట్ర నాయకులు కానుగుల దశరథం, జగన్, కృష్ణానాయక్, బాబా, విజయ్, శివలింగం, ప్రసాద్, సురేశ్, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

13న బీఆర్ఎస్ బహిరంగ సభకు కదలాలి

ఆదిబట్ల, ఫిబ్రవరి 6 : కృష్ణా బేసిన్ ప్రాజెక్టు, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించనున్నదని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు జంగయ్య, శ్రీకాంత్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. 13న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎక్కడికైనా పోరాడుతామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ప్రతి కార్యకర్త, నాయకులు కదలాలన్నారు.

తప్పల తడకగా 'నెక్' ఓటరు జాబితా

నెక్ రూపొందించిన ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని చూపుతున్న పౌల్ట్రీ వ్యాపారి, రైతు పాతూరి వెంకట్రావు

- నెక్ ఎన్నికల తీరుపై పౌల్ట్రీ రైతుల ఆగ్రహం

షాద్‌నగర్, ఫిబ్రవరి 6 : పౌల్ట్రీ రైతుల సంక్షేమం, వ్యాపార ప్రయోజనాలను కాపాడాల్సిన నేషనల్ ఎగ్ అర్డినేషన్ కమిటీ(నెక్) ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతుల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్నదని పౌల్ట్రీ రైతు, వ్యాపారి పాతూరి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని కేకే గార్డెన్‌లో నిర్వహించిన నెక్ జోనల్ కమిటీ ఎన్నికల వాయిదా అనంతరం ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాల్సిన సంస్థ ప్రతినిధులు ఇష్టానుసారంగా ఓటరు జాబితాను రూపొందించారని.. రైతులకు ఓటు హక్కు కల్పించకుండా.. లీజుదారుల పేరుతో అర్హత లేని వారికి ఓటు హక్కు కల్పించారని ఆరోపించారు. రైతులు ఓటు నమోదు చేసుకున్నా ఓటరు జాబితాలో మాత్రం వారి పేర్లు రాలేదని, తమకు అనుకూలమైన వర్గానికి చెందిన వారికి అధిక ఓట్లను కల్పించారన్నారు. సక్రమంగా ఎన్నికలు జరగాల్సి ఉన్నప్ప టికీ షాద్‌నగర్ జోన్‌లోని ఓ వర్గం వారు అడ్డుకున్నారని తెలిపారు. ఎన్నికలు రద్దు కావడంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన పౌల్ట్రీ రైతులు వెనుదిరిగారు. ఈ జోన్ పరిధిలో 201 ఓట్లు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ వర్గం రైతులు ముందస్తుగానే అర్హత లేని వారి పేర్లను నెక్ ఓటరు జాబితాలో చేర్చి ఎన్నికల్లో విజయం సాధించాలని యత్నించినట్లు మరో వర్గం రైతులు ఆరోపించారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఎన్నికలను రద్దు చేస్తున్నట్లు నెక్ సంస్థ సభ్యులు తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్, ఫిబ్రవరి 6 : కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 16న దేశ వ్యాప్త కార్మికుల సమ్మె–గ్రామీణ భారత్ బంద్‌లో మున్సిపల్ కార్మికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు భాగస్వాములవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ అన్నారు. మంగళవారం సమ్మె నోటీసును రాగన్నగూడ వార్డు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తైనా దేశంలోని రైతులు,కార్మికవర్గాల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మాల్యాద్రి, కార్మికులు ముత్యాలు, చంద్రయ్య, భాస్కర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

యాచారం, ఫిబ్రవరి 6: కొత్తపల్లి గ్రామానికి చెందిన పోలే శంకరయ్య ఇబ్రహీంపట్నం డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. పట్నం డిపోకు చెందిన ఆర్టీసీ అధికారులు వెంకట్‌నాయక్, ఆంజనేయులు, చందర్ శంకరయ్య మృతదేహంపై పూలమాలేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం వచ్చేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జగన్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 6: ప్రతి ఒక్కరూ నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, కల్తీ నుంచి కుటుంబాన్ని సంరక్షించుకోవాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. కాంచనలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో వర్కషాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అనేక దేశాలతో పాటు మన దేశంలో కూడా ఆహారం కల్తీ సర్వసాధారణమైందన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా వ్యాపిస్తుందని, దీని వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు జ్యోతి, సతీశ్, లక్ష్మి, శకుంతల, వైష్ణవి, షేక్‌మహబూబ్, రవీందర్, స్వర్ణలత, వెంకటేశ్వర్లు, వీరేశం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

మొయినాబాద్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వం పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో వారం రోజులపాటు పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలని అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. గ్రామాల్లో ప్రజలకు నీటి సరఫరా చేసే మంచినీటి ట్యాంక్‌లు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయడం, రోడ్లు, మురుగు కాలువల శుభ్రం, గుంతల పూడ్చివేత, యాంటీ లార్వా రసాయనాలు చల్లడం , శిథిలావస్థకు చేరిన ఇండ్లను తొలగించడం, పాడుబడిన బావులను మూసివేయడం తదితర వాటిని చేపట్టనున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, యువజన సంఘాల సభ్యులను భాగస్వాములను చేయ నున్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌కు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉన్నది. కొన్ని పనులను డబ్బులు పెట్టి.. మరికొన్నిటిని డబ్బులేకుండా చేయాల్సినవి ఉంటాయని కార్యదర్శులు చెబుతున్నారు. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం పూర్తై, ప్రత్యేకాధికారుల పాలన వచ్చిందని.. డబ్బులతోకూడిన పనులకు నిధులను ఎక్కడి నుంచి తీసుకురావాలని వారు పేర్కొంటున్నారు.

డ్రైవ్‌ను సక్సెస్ చేస్తాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తాం. ఇందులో గ్రామాల్లోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి విజయవంతం చేస్తాం. ప్రజ టలకు పారిశుధ్యం, ఇంకుడుగుంతలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, సామాజిక దురాచారాలపై అవగాహన కల్పిస్తాం. ఇంటి పరిసరాల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, వ్యక్తిగతంగా నిర్మించుకున్న మరుగుదొడ్ల వినియోగంపై వివరిస్తాం. –సంధ్య, ఎంపీడీవో, మొయినాబాద్

ప్రతిభను వెలికి తీసేందుకు దోహదం

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న సుఖవల్లబ్ స్వామి

మొయినాబాద్, ఫిబ్రవరి 6 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని లక్ష్మి పబ్లికేషన్ మేనేజర్‌లు షకీల్ బేగ్, రవీందర్ అన్నారు. లక్ష్మి పబ్లికేషన్ వారు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గత ఏడాది డిసెంబర్‌లో ఆల్ ఇండియా స్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా మండల పరిధిలోని స్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఫలితాలను సోమవారం విడుదల చేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థి అనర్ఘ్య (10వ తరగతి) ప్రథమ స్థానంలో నిలిచి రూ.70 వేల విలువ కలిగిని ల్యాప్ ట్యాబ్, రెండవ బహుమతిగా కృష్ణ అతిథ్యారెడ్డి (10వ తరగతి)రూ. 20 వేల మోటో ట్యాబ్, మూడవ బహుమతిగా వినాయక త్రిపాఠి (9వ తరగతి) విద్యార్థి రూ.20 వేల మొబైల్, పల్లె సూరితేజ(9వ తరగతి), ఇస్లామత్ కార్తిక్(10వ తరగతి), నీలు ప్రశాంత్(8వ తరగతి), ప్రశాంత్ నిఖిల్‌రెడ్డి(8వ తరగతి),అభిమన్యరెడ్డి(9వ తరగతి), కుషాల్‌రెడ్డి(8వ తరగతి), జితిన్(10వ తరగతి), తాండవ కృష్ణ(10వ తరగతి), బంగారు రాహుల్(10వ తరగతి), గోపిగారి శివప్రసాద్(10వ తరగతి) విద్యార్థులు రిస్ట్ వాచ్‌లను కైవసం చేసుకున్నారు. మంగళవారం పాఠశాలకు చేరుకుని నిర్వాహకులు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బహుమతులను సుఖవల్లభ స్వామిజీ, గురుకుల పాఠశాల సీఈవో సతీష్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్‌కే ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 6 : అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్ వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు అన్నారు. మంగళవారం దేవరంపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సి.ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా బాలు, నర్సింహులు, ప్రధాన కార్యదర్శులుగా యాదయ్య, ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎర్రవల్లి రమేశ్, మీడియా కార్యదర్శిగా ఎర్ర సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎర్రవల్లి రవికుమార్, సలహాదారులుగా బండమీది శివయ్య, బైండ్ల జంగయ్య, జంగయ్య, నరేందర్, కార్తీక్‌ను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

దేవరంపల్లి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న సంఘం ప్రముఖులు

ఆదిబట్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీకాంత్

ఆదిబట్ల, ఫిబ్రవరి 6 : ఆదిబట్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా తుర్కయంజాల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత కమిషనర్ అమరేందర్‌రెడ్డి కొంత కాలంగా తమ సొంత పనులపై వెళ్లడానికి సెలవు పెట్టారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చేగూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, ఫిబ్రవరి 6 : మత సామరస్యానికి ఉర్సు ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని చేగూరు గ్రామంలోని హజ్రత్ సయ్యద్ నిజాం దర్గా ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై బాబాలకు దట్టీలను సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లా ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీ కుమరస్వామిగౌడ్, నాయకులు శ్రీశైలం, తులసీరామ్, ముస్లిం మత పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలి

- జడ్పీటీసీ దశరథ్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కడ్తాల్, ఫిబ్రవరి 6 : మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ ఎంపీపీ ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో చావు నోట్లో తల పెట్టిన మాజీ సీఎం కేసీఆర్‌పై, కాంగ్రెస్ అగ్ర నాయకులు అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, తెలంగాణలో జరిగిన అభివృద్ధికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభించాయని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నామనే సోయి లేకుండా కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మంత్రులు బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు మాని, ఆరు గ్యారెంటీ అమలుకు కృషి చేయాలన్నారు. లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో జోగు వీరయ్య, కొప్పు కృష్ణ, శ్రీనూనాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 6 : రోడ్డు ప్రమాదల నివారణే లక్ష్యంగా మనమందరం కృషి చేయాలని శంషాబాద్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో గ్రామీణ అభివృద్ధి సంస్థ కళాబృందంతో నిర్వహించిన ట్రాఫిక్ నిబ్బంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. వాహనాల రద్దీ నానాటికి పెరుగుతున్నదని, అదే స్థాయిలో ప్రమాదాలు కూడా పెరిగి విలువైన ప్రాణాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై అందరికీ అవగాహన ఉండాలని, అప్పుడే కొంత మేర ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కళాకారుల బృందం పాడిన పాటలు స్థానికులను ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రతాపలింగం, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష, ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్, రోడ్డు భద్రత నిర్వాహణ అధికారి భానుప్రకాశ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ కళా బృందం సభ్యులు, పోలీసులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ క్యాంప్

మొయినాబాద్, ఫిబ్రవరి 6 : దివ్యాంగులు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి బస్‌పాస్‌లు పొందేందుకు బుధవారం క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నర్సింహచారి మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు క్యాంప్ ప్రారంభం కానున్నదని తెలిపారు. అర్హులైనవారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు కాపీలతో పాటు ఒక పాస్ ఫొటోతో క్యాంప్ వద్దకు రావాలని పేర్కొన్నారు.

అభివృద్ధికి దాతల సహకారం అవసరం

పాఠశాలకు మైక్‌సెట్, మైక్రోఫోన్ అందజేస్తున్న నర్సింహులు, స్వరూప

షాబాద్, ఫిబ్రవరి 6: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని సర్దార్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ జడ్పీహెచ్ పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్‌లు మునగపాటి స్వరూప, నర్సింహులు మైక్‌సెట్‌తో పాటు మైక్రోఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణకుమార్, రవీందర్, జంగయ్య, శివకుమార్, కృష్ణయ్య, సుశీల, గిరిజ, సునీత, భారతి, విజయశ్రీ, శశికళ, అంజిలమ్మ, కవిత, రోహిణి, మొయిన్, డాక్టర్ శంకర్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

47మందికి కంటి ఆపరేషన్లు

యాచారం, ఫిబ్రవరి6: వివిధ గ్రామాలకు చెందిన 47మందికి శంకర ఐ దవాఖాన సహకారంతో మంగళవారం ఉచితంగా కంటి ఆపరేషన్లను నిర్వహించారు. నందివనపర్తి మాజీ సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కొంత మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 47 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని వైద్యులు సూచించడంతో విజయ్‌కుమార్ సొంత డబ్బులతో ఉచితంగా ఆపరేషన్లు చేయించారు.